# ఫిరంగిలో జ్వరం

సెప్టెంబర్ 11వ తేదీ... వెంకటనాయుడి తోటలో వెయ్యికి పైగా చీనీ చెట్లను రాత్రికి రాత్రే ఎవరో నరికేశారనే వార్త ఇంకా పూర్తిగా తెల్లవారకముందే వరదలా ఆ ఊరిని ముంచివేసింది. చీనీ చెట్లతోపాటు వ్యవసాయ మోటార్లను పేల్చివేశారనీ, ఒక ట్రాక్టర్‌ను కూడా పెట్రోల్ పోసి తగులబెట్టారనీ, అంచెలంచెలుగా చుట్టూ వున్న పల్లెల ప్రజలందరికీ బారెడు పొద్దెక్కకముందే తెలిసిపోయింది. అంతే! వెంకటనాయుడి తోట తిరుణాలలా మారిపోయింది. ఈ దారుణాన్ని కళ్ళారా చూస్తూ "ఎవుడికేం పొయ్యేకాలం వచ్చిందర్రా పచ్చని చెట్లను నిలువునా నరికివేసినారు. వెంకటనాయుడి మింద కోపం ఉంటే ఆయప్ప మింద తీర్చుకోవల్ల. పాపం చెట్లేం చేసినాయి" అని కొందరూ, "ధైర్యముంటే నాయుడిని ఎదుర్కోవల్ల. ఇది పూర్తిగా పిరికి చర్య" అని మరికొందరూ, "ఇంకా రెండు కాతలు కూడా పూర్తీ కాయలే. దీండ్లకోసం నాయుడు ఎంత ఖర్చుపెట్టె. నీళ్ళు చాలకపోతే ఎన్ని బోర్లు వేయించె" అంటూ సానుభూతితో కొందరూ, "నేననుకుంటానే ఉండా. ఇట్లాంటి గతి ఎప్పుడో ఒకప్పుడు నాయుడికి పడుతుందని" అని గొణుక్కుంటూ కొందరూ, "చూసినాం లేప్పా, నాయుడేం తక్కువ తిన్నాడా? ఈయప్ప ఎంతమంది గడ్డివాములు కాల్చిలేదు! ఎందరి చెట్లు నరికీలేదు. ఇంక మనుషుల్ని యాటికాటికి కీళ్ళు ఇరిపీలేదు. చేసుకున్న వాళ్ళకు చేసుకున్నంత" అంటూ వెనకటివన్నీ తిరగదోడుకుంటూ కొందరూ – రకరకాల వ్యాఖ్యానాలతో తోట నిండా మూగి వున్నారు.

ఇక పత్రికల రిపోర్టర్లు, సిటీ కేబుల్ వాళ్ళూ, కెమేరాలతోనూ, వీడియోలతోనూ జరిగిన ఘోర కాండనంతా బహు భంగిమల్లో దృశ్యీకరిస్తున్నారు. ఎవరేం చెప్పినా చకచకా రాసేసుకుంటున్నారు.

హైదరాబాద్‌లో ఉన్న వెంకటనాయుడు ఈ వార్త విన్న మరుక్షణం ఉరుకులు పరుగులతో తన అనుచరగణం వెంటరాగా, మధ్యాహ్నానికల్లా ఊరు చేరుకున్నాడు.

జరిగిన బీభత్సాన్ని చూడగానే అతని శరీరమంతా కంపించి పోయింది. తన పాదాల కింద భూమి కదులుతున్నట్లుగా చలించిపోయాడు. తన సింహాసనం ఎక్కడో

బీటలు వారిందన్న ఒక చిన్న సత్యంతో అతని తల దిమ్మెతిరిగిపోయింది. చుట్టూ ముప్ఫయ్ పల్లెలే కాదు. జిల్లా మొత్తం మీద తన తిరుగులేని ఆధిపత్యానికి సమ్మెట పోటు పడిందన్న అవమాన భారంతో అతని అహంకారం గర్జించింది. అతడి కళ్ళు ఎర్రబడ్డాయి. పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

సర్కిల్ ఇన్‌స్పెక్టరూ, ఎస్సయి, నలుగురు కానిస్టేబుళ్ళూ జరిగిన దాన్నంతా జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారు. వాళ్ళకిలాంటి ఘట్టాలన్నీ మామూలే. అయితే నాయుడుకీ ఘోరం జరగటం వాళ్ళకు కూడా అనూహ్యంగా ఉంది. నాయుడు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం మంత్రిగా, తన నియోజకవర్గానికి మొత్తం శాసనకర్తగా వైభవప్రాభవాలను నెరపుతున్నవాడు. తన నియోజకవర్గంలో కనీసం సర్పంచ్ పదవిని కూడా నాయుడి అనుగ్రహం పొందినవాడు మాత్రమే అధిష్ఠించగలడు. ఫలానావాణ్ణి పిలిచి నువ్వు నామినేషన్ వెయ్యకూడదు అంటే ఇక అంతే!

వెంకటనాయుడి ప్రమేయం లేకుండా చుట్టుపట్ల ఏ పెద్ద పంచాయతీ జరగదు. అతడు పంచాయితీలు నిర్వహించే తీరు విలక్షణమైనది. తను ఇచ్చే పంచాయతీ తీర్పు అమలు జరగటానికి, ఆ పొందినవాడితో, ఆ పంచాయతీ స్థాయిని బట్టి లక్షకో, రెండు లక్షలకో, అయిదు లక్షలకో తనకు బాకీ పడ్డట్టు బాండు రాయించుకుంటాడు. తన తీర్పు అమలయ్యేలా చూడాలంటే బాండ్లు తన దగ్గరే ఉండాలంటాడు. అంతే, బాండు భయంతో అతనికి అనివార్యంగా విధేయులౌతారు. ఇంతా తెలిసి అతని దగ్గరకు పంచాయతీకి ఎందుకు వస్తారు అంటే, "వెంకటనాయుడు ఫలానా పంచాయతీకి నిన్ను పిలుస్తున్నాడు, రావల్ల అంటే, "నేను రాను" అని చెప్పే ధైర్యమూ, తాహతూ లేకపోవటం వల్ల, బాండు ఆయన దగ్గర ఉన్నా ఆయన పట్ల విధేయంగా ఉంటే ప్రమాదం జరగదనే భరోసా వల్ల కూడా ఆయన దగ్గరకు వస్తారు.

వెంకటనాయుడు కోరుకొనేదీ అదే! జనం తన గుప్పిట్లో ఉండటమే! ఎవరైనా ఎదురు తిరిగితే వాణ్ణేం చెయ్యడు. మొదట వాడి కళ్ళాల్లోని గడ్డి వాముల్ని కాల్పిస్తాడు. వాడి చెట్లు నరికిస్తాడు. మరీ ఎదుటివాడు శత్రువుగా పరిణమిస్తాడు అని అనుకున్నప్పుడు తీసుకునే చర్యలు దారుణంగా ఉంటాయి. బాండ్లు బయటికి వస్తాయి. కోర్టులూ, పోలీసులూ. ఇంతవరకూ ఇలాంటి స్థితి ఒకటి రెండు సందర్భాలలో తప్ప నాయుడికి ఎప్పుడూ ఎదురు కాలేదు. నాయుడు చేసే ఏ దారుణాలకూ ఏ ఆధారాలూ ఉండవు.

రాజకీయ వర్గాల్లో వెంకటనాయుడు జిల్లా స్థాయిలో గట్టి పట్టు సంపాదించినాడు. తన పార్టీ అభ్యర్థులందరికీ అంగబలాన్ని అందిస్తాడు, అర్థబలాన్ని సమకూరుస్తాడు. జీపులూ, వాహనాలూ నడిపిస్తాడు. తన సైన్యాన్ని పంపి రిగ్గింగ్‌లకు సహకరిస్తాడు. సారా కాంట్రాక్టర్ కూడా అయినందున అలగా జనాన్నంతా తన సైన్యంగా సమీకరించుకుంటాడు. అవసరమైన చోట సారాయి జలపాతంగా ప్రవహింపచేస్తాడు. తన సైన్యానికి ఆయుధాలను తన సొంత ఆయుధాగారం నుండే అందిస్తాడు. బాంబులూ, నాటు తుపాకులూ తయారు చేసే ఆయుధ కర్మాగారాలు ఎన్నెన్ని చోట్ల ఉన్నాయో అతి సన్నిహితులకు మాత్రమే తెలుసు. తన ఆయుధాలను వ్యాపార సరుకుగా మార్చుకునే నైపుణ్యం కూడా నాయుడికున్న దక్షతల్లో అతి ముఖ్యమైనది. జిల్లాలో ఎక్కడైనా ఇరువర్గాల మధ్య ఘర్షణలు నెలకొన్నాయంటే ఏదో ఒక వర్గం తన ఆయుధ కర్మాగారం దాకా రావాల్సిందే. ఒక్కోసారి ఒకరికి తెలీకుండా మరో వర్గం కూడా రావచ్చు. అవసరంగానూ, అనవసరంగానూ రెండు గ్రూపుల మధ్య ఘర్షణలు చిరకాలం కొనసాగేలా చూసే నేర్పు వల్ల కూడా అతని ఆయుధ కర్మాగారం ఎప్పుడూ ఫ్రెష్‌గా వుంటుంది. గిరాకీతో ఉంటుంది.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జనార్దనరావు ఈ ప్రాంతం వాడు కాకపోయినప్పటికీ, వచ్చిన ఆరునెలల్లోనూ ఈ జిల్లా రాజకీయాల్ని, ముఠా కక్షల్నీ, వ్యవహార శైలుల్నీ సమగ్రంగా అర్థం చేసుకున్నవాడు. అయినప్పటికీ ఈ దారుణాన్ని ఎవరు చేసి ఉంటారో స్పష్టంగా నిర్ధారించుకోలేక పోతున్నాడు. వెంకటనాయుడు అజేయుడే కావచ్చు కానీ, అతనికున్న శత్రువర్గాలు అనంతమని అందరికీ తెలుసు. అందువల్లనే ఫలానా అని ఎవరూ చెప్పలేక పోతున్నారు. వెంకటనాయుడు తనకు బహిరంగ శత్రువు అని చెప్పుకోగలుగుతున్న వాడు ఒక్కడే ఉన్నాడు. అతడు వీరారెడ్డి. అయితే వీరారెడ్డి ఇప్పుడా పని చేయించగల సత్తాలోనూ లేడు. అర్థబలంలోనూ లేడు, అంగబలంలోనూ లేడు. రాజకీయ బలంలో అసలే లేడు. అతన్ని అలా నిర్వీర్యం చేసినవాడు కూడా నాయుడే!

నాయుడు హైదరాబాద్ నుండి వచ్చే సరికి సంగతి తెలిసిన రాజకీయ నాయకులూ, పార్టీల ప్రతినిధులూ, మిత్రులూ, బంధువులూ, సన్నిహితులూ, ఆశ్రితులూ, జీపుల్లో, కార్లల్లో, లారీల్లో గుంపులు గుంపులుగా వచ్చి చేరినారు. సానుభూతి ప్రకటించినారు. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ దుర్మార్గం చేసింది ఒక్కడైనా,

ఇద్దరైనా, పదిమందైనా, వందమందైనా వాళ్ళ అంతం చూడాలన్నారు. నాయుడిపట్ల తమకు గల సఖ్యాన్ని పత్రికల వాళ్ళతో ఉద్ఘాటించారు. నాయుడికి మేమంతా అండగా ఉంటామన్నారు.

సి.ఐ. జనార్ధనరావు, నాయుడి ఇంట్లో అతని పక్కనే కూచున్నాడు. "నాయుడుగారూ, మీరు రిపోర్ట్‌లో సంతకం పెట్టండి. మీ అనుమానాలు చెప్పండి. కేసు బుక్ చేసుకొని ఇన్వెస్టిగేషన్ ప్రారంభిస్తాము. మీరు చెప్పినవాళ్లందరినీ దినం మధ్యాహ్నం లోగా బొక్కలో పడేస్తాము" అన్నాడు, చిటిక వేస్తూ.

ఆ మాట వినగానే చిర్రున లేచి నిల్చున్నాడు వెంకటనాయుడు. "సి.ఐ.గారూ, మేం రిపోర్ట్ ఇచ్చేంత పెట్ట నాయుళ్ళం కాదు. ఈ పని చేసినవాడెవడో మాకు తెలుసు. జరిగింది చూశాక నా అనుమానం పూర్తీ బలపడింది. గణేనాయక్‌గాడు తప్ప మరెవ్వడూ ఈ పని చేసి ఉండడు. అండపిండ బ్రహ్మాండాల్లో వాడెక్కడ దాగున్నా వాడి తల నరికించేదాకా నేను నిద్రపోను. ఇది మా సొంత వ్యవహారం. ఇక మీరు వెళ్ళవచ్చు" అనేసరికి అక్కడున్న వాళ్ళ మనసుల్లో గణేనాయక్ పేరు క్షణకాలంలో సుడులు తిరిగిపోయింది. అందరూ ఒక్కసారిగా అదిరిపోయినారు కూడా! గణేనాయక్ నాయుడి మీద ఇంత సాహసం ఎలా చేయగలిగాడు? ఎలా సాధ్యమైంది? అసలు వాడు ఈ ఊళ్ళోకెలా రాగలిగాడు? రాత్రికి రాత్రిలో ఇంత పని ఒక్కడే చేయగలిగాడా? వందమందితో చేయించాడా? ఔరా గణేనాయక్!

❖ ❖ ❖

ఆరు సంవత్సరాల క్రితం...

మంచి మధ్యాహ్న సమయంలో వెంకటనాయుడు తీరుబడిగా, వసారాలో సింహాసనంలాంటి కుర్చీలో అధిష్ఠించి ఉండగా, నిలువెత్తుగా తన ఎదుట నిలబడి ఉన్నవాణ్ణి నింపాదిగా చూసినాడు. ఆరడుగులకు పైగా ఎత్తు, ఎర్రటి రంగుగల శరీరం, కనుల గుడ్లు ముందుకు ఊడిపడుతున్నట్లు సూటియైన చూపులూ, మొనలు దేలిన మీసాలూ, కండలు తిరిగిన దేహం, జుబ్బా, పంచెకట్టుతో సమున్నతంగా కనిపిస్తున్న ముప్ఫయ్ అయిదేళ్ళ మనిషిని చూసి, "ఎవడ్రా లోపల" అని గట్టిగా పిలిచాడు. లోపల్నుండి వచ్చిన గంగన్నతో "ఆ వచ్చిన వాడెవడో కనుక్కో" అన్నాడు దర్పంగా సిగరెట్ వెలిగించి.

కనుక్కోవాల్సిన అవసరం లేకుండానే "అయ్యా నాయుడుగారూ నా పేరు గణేనాయక్. మీతో పనిబడి వచ్చినాను" అన్నాడు స్పష్టమైన మాటతీరులో.

ఆ పేరు వినగానే ఒక్క క్షణం అప్రతిభుడైనాడు నాయుడు. గణేనాయక్! గణేనాయక్! తనతో పనిబడి రావటమా!

"అరరే! గణేనాయక్. ఎవరో అనుకున్నానయ్యా! ఇదే నిన్ను మొదటిసారి చూట్టం. రా రా! కూచో" అంటూ తనకు ఎడమవైపుగా ఉన్న పొడవాటి బెంచీ చూపించాడు వెంకటనాయుడు.

గణేనాయక్ బల్ల మీద నింపాదిగా కూచున్నాడు. అతని వెనుక కాస్త దూరంలో మరో నలుగురు నిలబడి ఉన్నట్టు అప్పుడు చూశాడు వెంకటనాయుడు. వాళ్ళంతా గణేనాయక్ వయసువాళ్ళే అయినప్పటికీ మొరటుగా కనిపిస్తున్నారు.

జిల్లాలో తెలియాల్సిన వాళ్ళందరికీ గణేనాయక్ పేరు తెలుసు. జిల్లాలో అరవైకి పైగా ఉన్న సుగాలీ తాండాలకు నాయకుడు గణేనాయక్. సుగాలీ తాండాల ప్రజలంతా గణేనాయక్‌ను అప్రకటిత నాయకుడిగా గౌరవిస్తారు, ఆరాధిస్తారు. తమ వాళ్ళ ప్రయోజనాల కోసం ఎలాంటి పని చేయటానికైనా సాహసంగా ముందుకు దూకుతాడు. అతడి మాటకు బదులు చెప్పకుండా పనులు చేసే గుంపు ఉంది. అతనేం చెబితే అది వాళ్ళు చేయగలరు. తమ పనులకు అడ్డం వచ్చినవాళ్ళను ఎదుర్కోవటమూ, యుక్తులు, శక్తులూ ఒడ్డి తమ్ము తాము రక్షించుకోవటమూ వారి జీవ లక్షణం. అందుకే జిల్లా వ్యాప్తంగా గణేనాయక్ పేరు ఎక్కడో ఒక చోట వినిపిస్తూనే ఉంటుంది.

గణేనాయక్‌లాంటివాడి అండకోసం ప్రయత్నించే రాజకీయపక్షాలూ, నాయకులూ లేకపోలేదు. అయితే, గణేనాయక్ ఒక చోట స్థిరంగా ఉండే రకం కాదు. జిల్లాలోని సుగాలీ తాండాలన్నిటినీ అతడు సుడిగాలిలా పర్యటిస్తుంటాడు. అతని కుటుంబ వ్యవహారాల గురించి కూడా చాలా వదంతులు ప్రచారంలో ఉన్నాయి. అతనికి చాలామంది భార్యలున్నారనీ, అక్కడక్కడా తాండాలలో అతని కుటుంబాలున్నాయనీ, పిల్లలున్నారనీ, అందువల్లనే అతడు ఒకే చోట ఉండడనీ కూడా అంటుంటారు. మనిషి మంచి క్రమశిక్షణ కలవాడనీ, బాగా చదువుకున్నవాడనీ, నియమపాలన పాటిస్తాడనీ, అనుకున్నది సాధించేదాకా పట్టు విడవడనీ తెలిసినవాళ్ళు చెబుతారు. తరతరాలుగా వెనుకబడ్డ తన జాతి ప్రజల ప్రయోజనాలే తన ప్రయోజనాలుగా పని చేస్తాడని కొందరూ, అతనికి చాలా వ్యాపారాలున్నాయనీ, అందుకోసం తన వాళ్ళను ఉపయోగించుకుంటాడని కొందరూ చేసే వ్యాఖ్యానాలు లేకపోలేదు.

వెంకటనాయుడికి, గణేనాయక్‌కు సంబంధించి అనేక విషయాలు ఒక్క క్షణంలో మనసులో మెదిలినాయి. తన నియోజకవర్గ పరిధిలో కూడా పదికి పైగా

తాండాలున్నాయి. ఆ తాండాల ప్రజలు కూడా తనకు తెలుసు. సున్నపు బట్టీలు పెట్టటం, మేకల పెంపకం వాళ్ళ వృత్తి. వాళ్ళ సారా ఒకసారి తాగినవాడు మళ్ళీ ఆ సారా కోసమే ఎదురు చూస్తాడు. తన నియోజకవర్గంలో ఉన్న ఒక తాండాలో గణేనాయక్‌కు చెందిన ఒక స్త్రీ ఉందని కూడా వినికిడి. ఈ గణేనాయక్‌తో ఇదే తన మొదటి పరిచయం.

"అయ్యా నాయుడుగారూ వచ్చిన పని చెప్పమంటారా" అంటూ నేరుగా రంగంలోకి దిగినాడు గణేనాయక్.

"చెప్పవయ్యా ఏ పనీ లేందీ నీలాంటివాళ్ళు నా దగ్గరకు వస్తారా ఏమిటి" అన్నాడు నాయుడు తన ఆధిక్యత స్ఫురించేలా.

"ఎన్టీఆర్ సంపూర్ణ మద్యనిషేధం ప్రకటించినాడు గదా! నిషేధానికి ముందున్న పరిస్థితులు ఇప్పుడు లేవు. మా మీద చాలా భయంకరమైన దాడులు జరుగుతున్నాయి." అని గణేనాయక్ మొదలుపెట్టేసరికి నాయుడికి విషయమంతా తేటతెల్లమైపోయింది. సంపూర్ణ మద్యనిషేధానికి ముందు తాను ఈ ప్రాంతానికి తిరుగులేని సారా సామ్రాట్. అకస్మాత్తుగా ఊడిపడ్డ ఈ నిషేధంతో తనలాంటివాళ్ళు రెక్కలు విరిగినవాళ్ళయిపోయినారు. తన అనుచర వర్గానికి పనులు చూపాల్సిన సంక్షోభం కూడా నెలకొని ఉంది. తను అధికార పక్షానికి చెందిన వాడు కావటం వల్ల తాను చేసే ప్రత్యామ్నాయ మార్గాలు సజావుగా జరుగుతాయన్న నమ్మకం తనకుంది. ఇలాంటి సమయంలోనే గణేనాయక్ రాక! సరిగ్గా ఈ పనిమీదనే! వెంకటనాయుడి ముఖంలో వికాస ఛాయలు నెలకొన్నాయి.

"చెప్పు గణేనాయక్ నావల్ల జరిగే ఎలాంటి సాయమైనా చేతనైనంతా చేస్తాను" అన్నాడు నాయుడు, తనది సాయం అందించే చెయ్యి అయినట్లు, నీది సాయం పొందే చెయ్యి అయినట్లూ ధ్వనింపచేస్తూ.

"నాయుడుగారూ! మీ నియోజకవర్గ పరిధిలో మా తాండాలు పది ఉన్నాయి. అన్ని కుటుంబాలూ కలిపితే వెయ్యి వరకూ ఉంటాయి. మావాళ్ళు కాచే సారా ఎలాంటిదో మీకు తెలియందికాదు. మావాళ్ళు పెట్టే సున్నపుబట్టీల గిరాకీ తరిగిపోయింది. వ్యవసాయాలు అంతంత మాత్రమే. ఇక మిగిలింది తరాలుగా వస్తున్న సారా ఒక్కటే ఆదాయమార్గం. మద్యనిషేధం లేని రోజుల్లో మావాళ్ళు కాచే సారాయి అంతంత మాత్రమే. ఇప్పుడలా కాదు. ఇదంతా మీకు వివరించాల్సిన పని

లేదు. ఇప్పుడు సారాకు గిరాకీ పెరిగింది. ఎక్సయిజ్‌వాళ్ళు మునుపటిలా లేరు. వాళ్ళ దాడులు ఎక్కువైపోతున్నాయి. కొట్టడాలూ, కేసులూ, జైళ్లూ ఇప్పుడు తీవ్రమైపోయింది.” గణేనాయక్ చాలా వివరంగా చెబుతున్నాడు. గణేనాయక్ తన దగ్గరకు ఎందుకొచ్చిందీ మరింత స్పష్టమైంది నాయుడికి. ఈ ప్రాంతంలోని తాండాలకు తన అండ కావాలి. వాళ్ళను ఎక్సయిజ్ నుండి రక్షించాలి. తాను అధికార పక్షానికి చెందినవాడు కాబట్టి తన లాంటివాడి అండా అవసరమూ గణేనాయక్ లాంటివాడికి కావాలి. సరిగ్గా ఇదే సమయంలో నాయక్‌లాంటివాడి అవసరమూ తనకుంది.

ఆ తర్వాత ఈ విషయమై వీళ్ళిద్దరి మధ్యా రెండు మూడు రోజులపాటు సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. గణేనాయక్ మనుషులు తయారు చేసే సారా ఏయే ప్రాంతాలకు ఎంతెంత. ఏయే విధాలుగా ఎప్పుడెప్పుడు ఎవరెవరు–ఇలాంటి నిర్ణయాలు జరిగిపోయాయి. నాయుడు తన మనుషుల్ని ఇందుకోసం ఎక్కడెక్కడ ఉంచాలో కూడా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. పెట్టుబడులూ వాటాలు కూడా ప్లాన్ ప్రకారం పద్ధతిగా జరిగిపోయినాయి. నాయుడు ఈ విషయంలో ఉదారంగా వ్యవహరిస్తూ మూడు వంతుల వాటా నాయక్‌కు ఇచ్చి, ఒక వంతు మాత్రమే తాను ఉంచుకున్నాడు. ఇందుకు ప్రతిఫలంగా నాయుడు గణేనాయక్‌ను తన మనిషిగా ఉండిపోవాలన్నాడు. ఇందుకు నాయుడికి సొంత కారణాలున్నాయి.

నాయుడి గురించి తెలిసిన వాళ్ళందరికీ వీరారెడ్డి గురించి కూడా తెలుసు. నాయుడికి వీరారెడ్డితో గల వైరం, కక్ష, కసి, స్పర్థ, పోరాటం ఈ నాటిది కాదు. ఒకరికొకరు ‘తనంతటి శత్రువులు’.

జిల్లాపై రాజకీయ అధికారాన్ని, సామాజిక ఆధిపత్యాన్ని సంపాదించటంలో పంచాయతీ సమితుల కాలంనుండే వాళ్ళ మధ్య పోరు ప్రారంభమైంది. జిల్లా పరిషత్తుకు తమ గ్రూపును గెలిపించుకోవటానికి ప్రతి సమితి ఎన్నికల్లోనూ ఎవరికి వాళ్ళు వ్యూహాలు పన్నుకున్నారు. డబ్బులు వెదజల్లుకున్నారు. ముఠాలను తయారు చేసుకున్నారు. ఆయుధాలను సమకూర్చుకున్నారు. సారా కాంట్రాక్టుల దగ్గర, రోడ్లు, భవనాలు, చెరువులు, బస్‌పర్మిట్లూ–ఇలా ప్రతి సందర్భంలోనూ జిల్లాను రెండు గ్రూపులుగా చీల్చివేశారు వీళ్ళు. ఎమ్మెల్యేల టికెట్ల దగ్గరా, జిల్లా మంత్రుల నియామకం దగ్గరా, ఒకటేమిటి వీళ్ళు స్పర్థ పడని సందర్భంలేదు. ఒక గ్రూపు ఊరిని, మరొకరు నిప్పుల కుంపటిగా మారిస్తే, వాళ్ళ గ్రూపు ఊరిని వీళ్ళు అగ్నిగుండంగా

మార్చేసేవాళ్ళు. ఆస్తుల నష్టాలూ, హత్యలూ, లూటీలూ, ఎవరికి ఎవర్నీ ఎక్కువా, తక్కువా చేసి చూడ్డానికి లేదు. వాళ్ళ ధ్యేయమంతా ఎదుటివాళ్ళను బలహీనపర్చడమే! అందుకోసం ముఠాలు విస్తృతం చేసుకున్నారు. కక్షలూ, కార్పణ్యాలూ ఎగదోశారు. పల్లెల్లో బాంబుల మోతలూ, తుపాకీ ధ్వనులనూ వినిపింపచేశారు. ఎవళ్ళకు వాళ్ళు బాంబుల పరిశ్రమల్నే నెలకొల్పుకున్నారు.

ఈ నేపథ్యంలో తన ఎదుటకు వచ్చి తనతో సారా కాంట్రాక్టు కుదుర్చుకున్న గణేనాయక్ ఒక మంచి ఆయుధం. గణేనాయక్, అతని అనుచరగణమూ తన సైన్యంగా గుర్తింపు పొందాలి. వీరారెడ్డి వర్గాన్ని గణేనాయక్ ద్వారా అణచివేయాలి. చికాకు కలిగించాలి. గణేనాయక్ తన మనిషి అని తెలియగానే వాళ్లు నీరుగారిపోవాలి. ఇదీ నాయుడి వ్యూహం.

"నాయక్ ఇప్పటినుండి నువ్వూ, నీ మనుషులూ నా వాళ్ళుగా ఉండిపోండి. నా నియోజకవర్గంలోనే కాదు, జిల్లా మొత్తం మీద మీ వాళ్ళందరికీ నా అండ కల్పిస్తాను. నీ సాయం నాకు కావాలి. ముఖ్యంగా వీరారెడ్డి విషయంలో..." అంటూ అసలు రాజకీయంలోకి దిగినాడు నాయుడు.

గణేనాయక్ అఖండుడు. అతడికి విషయం వెంటనే అర్థమైపోయింది. వీరారెడ్డి ఒక విధంగా తాను ఎదుర్కోదగ్గ మనిషే! వ్యవసాయ పనులకు రాలేదని, అతని ఊరి పక్కనున్న తన తాండా మొత్తాన్ని ఊరు విడిపించిన దౌర్జన్యపరుడు వీరారెడ్డి. వీరారెడ్డివల్ల భవిష్యత్తులో తమవాళ్ళకెక్కడా ప్రమాదాలు రాకుండటానికి నాయుడిలాంటి వాడి అండ తమకూ అవసరమే. ఈ రెండు వర్గాల మధ్యగల శత్రుత్వం వల్ల తాను పొందే ప్రయోజనాలను కూడా గణేనాయక్ ఆలోచించాడు. బదులు మాట్లాడకుండా వెంకటనాయుడితో చేతులు కలిపినాడు నాయక్.

గణేనాయక్ బలగం ప్రవేశంతో వీరారెడ్డి వర్గం క్రమంగా బలహీనపడింది. వీరారెడ్డి వర్గానికి చెందిన ముఖ్యమైన అనుచరులను వెంటాడి వేటాడి నిర్మూలించినాడు గణేనాయక్. గణేనాయక్ ఈ సందర్భంగా అపారమైన ఆయుధ సంపత్తినీ, ధన సంపత్తినీ సమకూర్చు కున్నాడు. అంతర్గత కలహాలవల్ల కూడా ఈ నాలుగైదేళ్ళలో వీరారెడ్డి వర్గం క్షీణ ప్రస్థానంలో పయనిస్తోంది. వీరారెడ్డి వర్గం ఇప్పుడు ఏ కాంట్రాక్టుల్లోగానీ, ఎన్నికల్లోగానీ బలమైన పక్షం కాకపోవటంతో నాయుడు జిల్లా స్థాయిలో మరింత బలపడినాడు. నాయుడితోపాటు గణేనాయక్ కూడా ఈ

నాలుగైదేళ్ళలో ఎంతో బలపడినాడు. అయితే నాయుడు, గణేనాయక్ బలాన్ని సరిగా అంచనా వేయలేకపోయినాడు.

ఇంత ప్రధాన అనుచరుడైన గణేనాయక్, నాయుడి తోటను నరికివేయటం ఏమిటి? నాయుడికీ, నాయక్‌కు ఎక్కడ వ్యవహారం బెడిసింది? జిల్లా మొత్తం మీద ఇదే ఇప్పుడు ప్రధానమైన చర్చ. ఏ సారా వ్యాపారం కారణంగా నాయుడికీ నాయక్‌కూ మైత్రి ఏర్పడిందో, ఆ సారా వ్యాపారం కారణంగానే వాళ్ళ మధ్య వైరం తారాస్థాయికి చేరుకుందని రాజకీయ పండితులు క్షణాల మీద విశ్లేషించారు. అసలేం జరిగింది?

★ ★ ★

ఎన్టీఆర్ స్థానంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత, సంవత్సరం దాటకముందే ప్రభుత్వం పాక్షికంగా మద్యనిషేధాన్ని సడలించింది. సారాపై నిషేధాన్ని అలానే ఉంచి, కేవలం బ్రాందీ షాపులకు లైసెన్స్‌లు ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఇంతకాలం నిషేధం కోరల్లో చిక్కుకుపోయిన సారా కాంట్రాక్టర్లు ఒక్కసారిగా బ్రాందీ షాపులపై పడ్డారు.

వెంకటనాయుడుకు ఈ షాపులు, లైసెన్సుల వ్యవహారాలకు సంబంధించి పూర్వానుభవాలు చాలానే ఉన్నాయి. షాపులకు సులభంగా లైసెన్స్‌లు తెచ్చుకున్నాడు తను. మారిన ఎక్సయిజ్ విధానంవల్ల చాలామంది గతంలోలాగా పోటీలు పడకపోవటం వల్ల తన అనుచరవర్గానికి, సన్నిహితులకు, బంధువులకూ, మిత్రులకూ కుప్పతెప్పలుగా లైసెన్స్‌లు మంజూరు చేయించినాడు. బ్రాందీషాపులకు ఒక సిండికేట్ ఏర్పరచినాడు. దానికి మకుట స్థానంలో తానే ఉండిపోయినాడు. తన సొంత షాపులే కాక, చాలా షాపుల్లో ఎంతో కొంత శాతం తనదిగా చేసుకున్నాడు. ఇందువల్ల తనకు పెరిగే రాజకీయ ఆధిపత్యం పైనే తన ప్రధాన లక్ష్యం.

పాక్షికంగా నిషేధం సడలించిన తర్వాత కూడా నాయుడికీ, నాయక్‌కూ తీవ్రమైన భేదాభిప్రాయాలు కొంత కాలం ఏర్పడకుండా ఎవరికి వాళ్ళు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే రెండేళ్ళయ్యేసరికి పరిస్థితి బాగా ముదిరిపోయింది.

ఒక రోజు సాయంత్రం బాగా చీకటి పడుతుండగా, గణేనాయక్ తన జీపులో హడావిడిగా వెంకటనాయుడి దగ్గరకు దూకుడుగా వచ్చినాడు. అతని వెంట మామూలుగా ఉండే అనుచరగణం ఈసారి రెట్టింపుగా ఉంది. గణేనాయక్ చాలా అసహనంగా ఉన్నాడు. మామూలుగానే ఎర్రగా ఉండే అతని కళ్ళు సాయంకాలపు

సూర్యుని ఎండలో మరింత ఎర్రగా మెరిసిపోతున్నాయి. గేటుదగ్గరే ఆపాల్సిన జీపును నేరుగా నాయుడు కూచునే వసారా దాకా తెచ్చి చర్రున ఆపేసి, జీపులోంచి చకచకా దిగేశాడు గణేనాయక్. ఈ శైలి చూడగానే నాయుడు ఏదో కీడును శంకించాడు. "కూచో నాయక్ చాలా చీకటి పడుతుండగా వచ్చినావే" అంటూ బెంచీలవేపు చేయి చూపించినాడు నాయుడు.

"కూచోడానికేముందిలే నాయుడుగారూ మీరిలా చేస్తారని నేను అనుకోలేదు" అన్నాడు సాధ్యమైనంత శాంతంగా తన స్వరాన్ని ధ్వనింపచేసే ప్రయత్నం చేస్తూ. అయితే, నాయుడు ఆ స్వరాన్ని వెంటనే పట్టేసినాడు.

"ఏమిటీ నాయక్? నేను చేయటమేమిటి? అసలేం చేసినానని? ముందు కూచోవయ్యా" అన్నాడు చాలా సున్నితంగానే.

"నాయుడుగారూ ఈ నాలుగేళ్ళుగా మన మధ్య ఏం జరిగిందీ, ఎలా జరిగిందీ, ఎందుకు జరిగిందీ జిల్లా మొత్తానికి తెలుసు. నేను ఎక్కువ మాటల మనిషిని కాను. సూటిగా విషయంలోకి రండి. మా మనుషుల్ని నిన్నా, ఈ రోజూ దాదాపు వందమందిని మీరు బొక్కలోకి తోయించినారు. ఆరేడు చోట్ల సారా బట్టీలను ధ్వంసం చేయించినారు. వందకాన్లకు పైగా సరుకును మట్టిపాలు చేయించినారు. ఆడవాళ్ళూ, పిల్లలూ అనే తేడా లేకుండా మీ మనుషుల్తో కొట్టించినారు. ఇదంతా మీకు తెలీకుండానే జరిగిందా" అంటూ కచ్చితమైన జవాబును ఆశించే కంఠంతో నిలదీస్తున్నట్లు ప్రశ్నించేసరికి, నాయుడు ఇక వ్యవహారాన్ని అటో ఇటో తేల్చే సమయం వచ్చేసిందనే నిర్ణయానికి వచ్చినాడు. అయినా, అతని పెదవులపై పల్చటి చిరునవ్వు కదులుతూనే ఉంది.

"నేనేం తొందరపడలేదు నాయక్. నువ్వే తొందరపడి నన్ను అంటున్నావ్" అన్నాడు వెంకటనాయుడు శాంతాన్ని అభినయిస్తూ.

ఈ మాట వినగానే గణేనాయక్ పక్కనున్న బల్లపై కోపంతో చేతులాన్చి "నేను తొందరపడి అంటున్నానా? ఇది నేను మొదటిసారా మిమ్మల్ని ఈ విషయమై హెచ్చరించటం. అయినా మీరు మీ పద్ధతుల్ని ఉధృతం చేసినారే గాని నా మాట పట్టించుకోలేదు" అన్నాడు చాలా ఆవేశంగా.

సమస్య పూర్వాపరాలు ఇద్దరికీ తెలుసు. ఏ రోజో ఒక రోజు ఇలాంటి తీవ్రమైన వాగ్యుద్ధం జరగకపోదని కూడా ఇద్దరికీ తెలుసు. అయితే, జరిగేది జరగాల్సిందే అనే అభిప్రాయంలో ఉన్నాడు నాయుడు. తన ప్రయోజనాలకు ఎవరివల్ల భంగం

వాటిల్లినా సహించే స్వభావం నాయుడిలో లేదు. పాక్షికంగా నిషేధం సడలించిన తర్వాత, వైన్‌షాపులకు భారీ పెట్టుబడులతో రంగంలోకి దిగినాడు నాయుడు. వైన్‌షాపుల్లో అమ్మకాలను పెంచుకోకపోతే మళ్ళీ రెన్యువల్ కాలానికి ఎవరైనా సంక్షోభంలో పడిపోతారు. అసలే నూతన ఎక్సయిజ్ విధానంలో లాభాలబాట సవ్యంగాలేదు. అందువల్ల చీఫ్ లిక్కర్ మీద ప్రధానంగా ఆధారపడక తప్పదు. చీఫ్ లిక్కర్‌ను ప్రతి పల్లెకూ అందించాలి. నాటు సారా స్థానంలో చీఫ్ లిక్కర్‌ను మేనేజ్ చేసుకోవాలి. బెల్టుషాపులన్ని చోట్లా పనిచెయ్యాలి. ఇక్కడే నాయుడికీ, నాయక్‌కూ ఘర్షణ. నాయక్‌కు చెందిన తాండాలు తయారు చేసి అమ్మే నాటుసారా ఆపకపోతే తన లిక్కర్ మార్కెట్ కాదు. ఇప్పుడు నాయుడి వ్యాపారానికి ప్రధానమైన శత్రువు నాటుసారా. ఆ నాటుసారా తయారు చేసే తాండాలు. వ్యాపారం ప్రారంభించిన కొంతకాలం వరకూ ఓపికపట్టిన నాయుడు ఇక నాటు సారాను నిర్మూలిస్తే తప్ప తమ వ్యాపారం ముందుకు సాగదనే నిర్ణయానికి వచ్చినాడు. నాయుడుకూ, నాయక్‌కూ ఈ విషయమై చాలా సార్లు చిన్న స్పర్థలు చోటుచేసుకున్నాయి. కొద్దిగా ఘర్షణపడ్డారు కూడా. "మీ వాళ్ళను సారా ఎత్తివెయ్యమను. నేను చీప్ లిక్కర్ సప్లయి చేస్తాను. పర్సెంటేజీ ఇస్తాను. ఖర్చూ, శ్రమ లేకుండా వాళ్ళు బతుక్కుంటారు" అని నాయక్‌కు నచ్చచెప్పే ప్రయత్నం చాలా సార్లు చేసినాడు నాయుడు.

"అదెలా సాధ్యం నాయుడూ, పెద్ద యెత్తున పకడ్బందీగా సాగే మా వ్యాపారం మానేస్తే, మీ చీప్ లిక్కర్ అమ్మకాల వల్ల వేలాది మంది మా వాళ్ళ బతుకులు గడుస్తాయా? మునుపటిలాగే మీరూ, మేమూ ఉందాం. కావాలంటే ఒకటి రెండు ఏరియాల్లోకి మేము రాము" అని నాయక్ ప్రతిపాదించగానే నాయుడి కోపం నాభినుండి తన్నుకొచ్చింది. 'వీడా తనకు ఏరియాలు ఇచ్చేవాడు' అని పళ్ళు కొరుక్కున్నాడు.

"నాయక్, చాలా దుబారాగా మాట్లాడతా ఉండావు. నా వ్యాపారానికి నేను పెట్టిన పెట్టుబడి ఎంతో తెలుసా? కోట్లకి పైగా వుంటుంది. మీ సారా కారణంగా నా వ్యాపారంలో నష్టం తెచ్చుకోమంటావా? మీది పెట్టుబడి లేని వ్యాపారం. మీ కొచ్చే నష్టం ఏమీ లేదు" అంటూ కొంత కోపాన్ని దిగమించుకొని, నాయక్‌కు కొన్ని రాయితీలను సూచించినాడు. "నేను నీకు ఒక బ్రాందీషాపును పూర్తిగా ఇచ్చేస్తాను తీసుకో. బెల్టు షాపుల బాధ్యతను కూడా నీకే అప్పగిస్తాను. మీ వాళ్ళను ఈ పనిలో

పెట్టుకో. కావాల్సినన్ని వాహనాల్ని వాడుకో. మన ఏరియాలోకి కొత్త సరుకు రాకుండా చూడు. కర్నాటక మద్యంలో కూడా నీకు కొంత వాటా ఇస్తాను" ఇలా రకరకాలుగా చెప్పినా నాయక్ ససేమిరా వినలేదు. ఇది ఇలాగే నాయుడు చెప్పినట్లు నడిపిస్తే ముందు ముందు తమ గుంపు ప్రజలు తన ఆధీనంలో లేకుండా నాయుడి ఆధీనంలోకి పూర్తిగా వెళ్ళిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల ఇద్దరి మధ్యా వ్యవహారం బెడిసిపోయే ప్రమాద సూచిక ప్రారంభమైంది అప్పుడే.

నాయుడు తన వ్యవహారశైలిని ఏమాత్రం మార్చుకోలేదు. రోజురోజుకూ ఎక్సయిజ్ పోలీసులతోనూ, తన మనుషుల్తోనూ దాడులు తీవ్రం చేయించినాడు. సారాబట్టీలను నేలమట్టం చేసి కాసేవాళ్ళందరినీ జైలుపాలు చేయించాలని గట్టి నిర్ణయం తీసుకున్నాడు. దాని పర్యవసానమే ఈ రోజు నాయక్‌తో ఘర్షణ.

ఈ సన్నివేశంలో ఇద్దరి మధ్యా చాలా తీవ్రమైన వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ఒకరినొకరు 'నేను నీకింత చేసినాను' అంటే, 'నేను లేకపోతే నువ్వెక్కడున్నావ్' అనుకునేదాక మాటలు ముదిరినాయి.

"చూడు నాయక్! నేను నా హయాంలో నీలాంటి వాళ్ళెందరినో చూసినాను. పెంచి పోషించినాను. నా అవసరాలూ, నా ప్రయోజనాలే నాకు ముఖ్యం. ఆ తర్వాతనే మిగతావన్నీ. నీలాంటి వాడి బెదిరింపులెన్నెన్నో నేను చూసినాను. నా సంగతి జిల్లా మొత్తం తెలుసు. నువ్వెంత? నీ సామ్రాజ్యమెంత? ఇక నువ్వు వెళ్ళవచ్చు" అంటూ లేచి నిలబడి ఎడమ చేతి చూపుడు వేలును గేటు వేపు చూపించాడు నాయుడు.

గణేనాయక్ ఈ మాటలతో రెచ్చిపోయినాడు. "అయితే, సామ్రాజ్యాలను ఎంచే స్థితికి వచ్చావన్నమాట. నీ గొప్ప ఏమిటి? నువ్వొక బడా వ్యాపారస్థుడివి... నీ రాజకీయాలు, పదవులూ, అధికారాలూ, అన్నీ నీ వ్యాపారం కోసమే. నీకే కాదు. నా వ్యాపార ప్రయోజనాలు నాకూ ఉన్నాయి. నాది చిన్న సామ్రాజ్యమే కావచ్చు. జిల్లా మొత్తం మీద మావి నూటికి పైగా తాండాలున్నాయి. మేం అనుకుంటే ఏమైనా చేయగలం. చేసి చూపిస్తాను కూడా. నా తడాఖా నీకు త్వరలోనే తెలుస్తుంది" అంటూ పెద్దగా అరుస్తూ తన గణంతో వేగంగా వెళ్ళిపోయాడు గణేనాయక్.

ఈ సంఘటన జరిగి ఆరు నెలలు గడవక ముందే రెండు చిన్న ప్రమాదాలు నాయుడికి సంభవించినాయి. పట్టణంలో ఉన్న అతని వేరుశనగ ఆయిల్ మిల్

గిడ్డంగిలో చిన్న అగ్నిప్రమాదం జరిగి లక్ష రూపాయల ఆస్తినష్టం జరిగింది. మరో వారానికల్లా అతని బెల్టుషాపుల మీద దాడులు జరిగి, మద్యంతోపాటు రెండు జీపులు మంటలకాహుతి అయినాయి. అదే నెలలో అతడు వేయబోయే ఒక టెండర్‌కు విఘాతం ఏర్పడి అయిదారు లక్షల నష్టం జరిగింది. వెంకటనాయుడు అప్పుడే ఈ అన్నిటి వెనుక గణేనాయక్ ఉన్నాడని శంకించాడు.

ఇప్పుడు ఈ చెట్ల నరికివేత ఘోరం చూసినాక, ఇదంతా నిస్సందేహంగా గణేనాయక్‌గాడి పనే అని గట్టిగా, బాహాటంగా ప్రకటించేశాడు కూడా. వాడి అంతు తేలుస్తానన్నాడు. వాడెక్కడ దాగున్నా పట్టిలాక్కొచ్చి తల నరికిస్తానన్నాడు వెంకటనాయుడు.

❖ ❖ ❖

వెంకటనాయుడి ఈ ప్రకటనా, ఈ పంతమూ జిల్లా అంతటా సంచలనాన్ని కల్గించటమే కాక, వివాదస్పదంగా కూడా మారిపోయింది. చట్టాన్నీ, న్యాయవ్యవస్థనూ నాయుడు తన చేతుల్లోకి తీసుకుంటున్నాడన్న విమర్శలు వచ్చాయి. 'అసలు గణేనాయక్ ఈ పని చేసినాడనటానికి ఆధారమేమిటి?, కొన్ని రాజకీయ పక్షాలు నిలదీసి ప్రశ్నించినాయి.

వెంకటనాయుడు మరో అడుగు ముందుకు వేశాడు. గణేనాయక్ ఎక్కడున్నా తన ఎదుటకు వచ్చి వెంటనే లొంగిపోవాలనీ, అతడు, ఎక్కడ దాగున్నాడో తాను తెలుసుకోగలననీ, ఏ తాండాలో ఉన్నాడో ఆ తాండా పెద్దలు తనకు నాయక్‌ను అప్పగించాలనీ, లేకపోతే జిల్లా మొత్తంలో ఉన్న తాండాలను ధ్వంసం చేస్తాననీ, రోజుకో ప్రకటనల అస్త్రాల్ని జళిపింపచేశాడు.

"గణేనాయక్ నీకు అపకారం చేసి వుంటే అది కేవలం మీ ఇద్దరి సమస్య. ఇందుకు అమాయకులైన తాండా ప్రజల మీద దాడులు చేస్తాననడమేమిటి" అని కొన్ని వర్గాలూ, "గణేనాయక్ తాండాల ప్రతినిధి. అతన్ని నాయుడికి అప్పగించాల్సిన బాధ్యత తాండాలదే" అని మరికొన్ని వర్గాలూ చేసే వ్యాఖ్యానాలు ఏదో ఒక మూల వెలువడుతూనే ఉన్నాయి.

ఈ సందర్భంలోనే "గణేనాయక్ మా మనిషి. అతడు మా దగ్గరే ఉన్నాడు. మేం అతన్ని నాయుడికి అప్పగించం. అతన్ని రక్షించుకోవటం కోసం మేము మొత్తం పోరాడుతాం. అంతేకాదు. మేము తొందర్లో నాయుడినే ముగిస్తాం" అని ఒక తాండా

నాయకుడు బహిరంగంగా ప్రకటించేసరికి వాతావరణంలో పోరాట ఛాయలు నెలకొన్నాయి.

దీంతో నాయుడు ఇక ప్రత్యక్షంగా రంగంలోకి దిగక తప్పదు అన్న నిర్ణయానికి వచ్చేశాడు.

ఒక రోజు రాత్రికి రాత్రి తన నియోజకవర్గ పరిధిలో ఉన్న ఒక తాండాపై తన బలగంతో దాడి జరిపించాడు నాయుడు. ఆ తాండాలో మొత్తం కుటుంబాలు వందకు మించి లేవు. అరవై పాకల వరకూ ఆ దాడిలో అగ్నిమంటలకు ఆహుతి అయ్యాయి. పాకల్లో ఉన్న సమస్తమూ బూడిద అయ్యాయి. ఒక వృద్ధుడూ, ఒక పసిపిల్లా మంటల్లో మాడిపోయారు.

ఈ దాడులు చేసిన వాళ్ళు "గణేనాయక్‌గాడు ఎక్కడున్నాడో చెప్పండి. లేదా మాకు పట్టి ఇవ్వండి. అంతవరకూ మా నాయుడు మిమ్మల్నిలా నాశనం చేస్తూనే ఉంటాడు" అంటూ గట్టిగా అరుస్తూ అక్కడున్న వాళ్ళకు వినిపించి వెళ్ళిపోయారు.

వెంకటనాయుడిపట్ల సానుభూతి ప్రకటించినవర్గం తప్ప జిల్లా మొత్తం ఈ దాడిని ఖండించింది. వెంకటనాయుడిని వెంటనే అదుపులోకి తీసుకొని శాంతిభద్రతల్ని రక్షించాల్సిందిగా పోలీసు వర్గాలకూ, ప్రభుత్వానికీ జిల్లాలోని అనేక సంస్థలూ, రాజకీయ పక్షాలు విజ్ఞప్తి చేశాయి. ఇది వెంకటనాయుడి పని అని స్పష్టంగా తెలిసినప్పటికీ జిల్లా యంత్రాంగం అలాగే స్తంభించిపోయి చూస్తుండిపోయింది.

జిల్లాలోని గణేనాయక్‌కు చెందిన తాండాల గుంపులన్నీ ఈ విషయమై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేసినాయి. "ఇందుకు తగిన ప్రతీకారాన్ని మేము తీర్చుకుంటాం. నాయుడి భరతం పడతాము" అంటూ ఒక వృద్ధ తాండా నాయకుడు బాహాటంగా స్పష్టం చేసేసరికి, తాండాలు మొత్తం ఒక తాటి మీదకి వచ్చే పరిస్థితి నెలకొనింది.

"తమ సొంత ప్రయోజనాల కోసం జిల్లా మొత్తాన్ని అగ్ని గుండంగా మార్చకండి. అమాయకుల ప్రాణాలతో, ఆస్తులతో ఆడుకోకండి. నాయుడు తన ఆధిపత్యాన్ని నిల్పుకోవటం కోసం చేసే పోరు వెనుకా, గణేనాయక్ తన వునికి రక్షించుకోవటం కోసం చేసే పోరాటం వెనుకా ఉన్నవి స్వార్థపర వ్యాపార ప్రయోజనాలే అనీ, వీళ్లిద్దరూ జిల్లా సాంఘిక జీవనాన్ని ధ్వంసం చేస్తున్నారనీ" సమస్యను సరిగా అర్థం చేసుకున్న ప్రగతిశీల పక్షాలు ప్రకటించాయి.

వెంకటనాయుడికి, ఇది తనకొక పరీక్షా సమయం అన్న స్పృహ పెరిగిపోయింది. అందర్నీ కూడగట్టే పనిలో ముందుకు కదిలాడు. తన చిరకాల ప్రత్యర్థి వర్గం వీరారెడ్డితో సంప్రతించాడు. వెంటనే వీరారెడ్డి స్పందించి, "నాయుడూ, గణేనాయక్ నీకే కాదు, మాకూ శత్రువే. ఇలాంటివాణ్ణి ఏ రూపంలో నిర్మూలించినా నా సహాయం అందిస్తాను. మన పాత పగలు పక్కనబెట్టి నిన్ను బలపరుస్తాను" అనేసరికి నాయుడి ధైర్యం కొండంత పెరిగిపోయింది.

తన ముఠాలో బాంబులు పేల్చటం, తుపాకులు కాల్చటం, మనుషుల్ని నిర్దాక్షిణ్యంగా నరకటంలాంటి వాటిలో ఆరితేరిన వాళ్ళతో ఈసారి నాయుడు తన దాడుల వ్యూహాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేసినాడు.

ఒక్కసారిగా వివిధ ఏరియాలలో ఉన్న తాండాలవేపు అతని ముఠాసైన్యం ఇప్పుడు కదలికలు సాగిస్తోంది. జీపులూ, సుమోలూ, లారీలూ, ట్రాక్టర్లూ, ద్విచక్ర వాహనాల్లో అన్ని వైపులా ఒక్కో రోజు ఒక్కో ప్రాంతాన్ని నాశనం చేసే దిశగా వెంకటనాయుడి దళాలు ఆ రాత్రి కదలికలు ప్రారంభించాయి...

రేపటి ఆనందమైన సూర్యోదయం కోసం, తెల్లటి కాంతుల కోసం జిల్లావాసులు మరో వైపు ఆశాజనకంగా ఎదురుచూస్తున్నారు.

❖ **ఇండియా టుడే, వార్షిక సాహిత్య సంచిక, 2002**